క్లుప్తంగా

పది పరీక్షలకు 751 మంది హాజరు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఠానేల్లంక ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం బయోలాజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 753 మంది విద్యార్థులకు 751 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

కంటి వైద్య పరీక్షలు



ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: కోరంగిలోని కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ప్రగ్లపాటి కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణ జ్యోతి, దున్నా సత్యశ్రీకాంత్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ దేవస్థాన ఉత్సవ కమిటీ నియామకం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు నియమితులయ్యారు. కమిటీ సభ్యుడిగా కూరపాటి మావుళ్లయ్య, బొల్లోజు మౌనిక, యండమూరి శివకేశవ, గంటి శ్రీనివాసరావు, వెన్నా మాణిక్యాంబ, గనిశెట్టి శ్రీనివాస్, బొల్లోజు మల్లికార్జునరావు, సరిదే నాగ రాజకుమారి, గీతా శ్రీనివాసరావు, ముదపాక అక్షయ్ కుమార్ నియమితులయ్యారు. ఉగాది సందర్భంగా అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే ఉత్సవాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. దేవస్థానానికి ధర్మకర్తల మండలిని నియమించేలోగా తాత్కాలిక పద్ధతిలో ఉత్సవ కమిటీని సంబంధిత శాఖ నియమించిందని సభ్యులు తెలిపారు.

కొబ్బరి ఒలుపు కార్మికుడి అదృశ్యంపై కేసు

అమలాపురం టౌన్: అమలాపురంలో దుడ్డీవారి అగ్రహారానికి చెందిన కొబ్బరి ఒలుపు కార్మికుడు సుంకర ఈశ్వరరావు (57) అదృశ్యమయ్యాడు. ఈనెల 14న ఇంటి నుంచి కొబ్బరి ఒలుపు పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లి మళ్లీ అతడు తిరగరాలేదు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో ఈశ్వరరావు ఆచూకీ కోసం కుటుంబీకులు గాలించినా ఫలితం లేకపోయింది. ఈశ్వరరావు అదృశ్యంపై అతని సోదరుడు కుమారుడు నాగబాబు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. కాజులూరు మండలం పెనుమాల గ్రామానికి చెందిన ఈశ్వరరావు కొన్నేళ్ల క్రితం అమలాపురానికి వచ్చి అతని కుటుంబం ఇక్కడే స్థిరపడింది. ఈశ్వరరావు ఈనెల 14న పట్టణంలోని ఓ రైతు వద్దకు వెళ్లి రూ.వంద తీసుకుని వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉప్పలగుప్తం: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పలగుప్తంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలగుప్తం పంచాయతీ మధురపేటకు చెందిన అవివాహిత యువకుడు మధుర రాజేష్ (30) శుక్రవారం సాయంత్రం తను సాగు చేస్తున్న పొలానికి వెళ్తుండగా అకస్మాత్తుగా విద్యుత్తు తీగలు తగలి సొమ్మసిల్లి పడిపోయాడు.రైతులు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి అతడిని తరలించారు. బాధితుడికి వైద్యులు ఎల్.నాగార్జున సీపీఆర్ చేసి అమలాపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అమలాపురం తీసుకెళుతుండగా మార్గం మధ్యలో అతడు మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతునికి తల్లి, తండ్రి, సోదరి, సోదరుడు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

యానాం: సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం విజ్ఞాన యాత్రలో భాగంగా స్థానిక కాకినాడ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ కోచ్‌ల తయారీ విధానాన్ని, దాని విడి భాగాలను క్షేత్రస్థాయిలో విద్యార్థులు పరిశీలించారు. పీఈటీ ఐవీకే మోహన్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలపై పీ–4 సర్వే పిడుగు

- ఈ సర్వే ఎందుకని ప్రశ్నిస్తున్న జనం
- పథకాల లబ్ధిదారుల్లో ఆందోళన
- ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది సర్వే



కొత్తమురమళ్లలో వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

ఐ.పోలవరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే సామాన్య ప్రజల్లో కొత్త ఆందోళనలకు కారణమవుతోంది. ఇటీవల సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి దీర్ఘకాలికంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారు, అంధులు, వికలాంగులకు సంబంధించి దఫదఫాలుగా సర్వే చేసి అనర్హత పేరుతో కొంతమంది లబ్ధిదారులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా పీ–4 సర్వేలో పలు రకాల వివరాలు సేకరిస్తుండడంతో ఈ సర్వే వల్ల మరికొన్ని సంక్షేమ పథకాలు తొలగిస్తారనే ప్రచారం సామాన్యులకు నిద్ర పట్టనివ్వడంలేదు.

సర్వే గడువు పెంపు

ప్రభుత్వం కొత్తగా సర్వేలు ప్రారంభించింది. ఈ సర్వేతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతోపాటు ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు, కాట్రేనికోన, అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సర్వే జోరుగా సాగుతోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో సుమారు 1.50 లక్షల ఇళ్ల వరకు ఉన్నాయి. మార్చి 3 నాటికి పీ–4 సర్వే పూర్తి చేయాలని తొలుత నిర్ణయించుకున్నారు. ఆలస్యమవడంతో ప్రభుత్వం గడువు పెంచింది. ఆయా మున్సిపాలిటీలోని వార్డులు, పంచాయతీల్లోని సచివాలయాల పరిధిలో ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నట్టు అధికార యంత్రాంగం చెబుతోంది. దీనిపై సామన్యులు, పేదలు సంక్షేమ పథకాలు పొందే ప్రజల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం కూడా ప్రజల అనుమానాలకు తావిస్తోంది.

27 ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు

సర్వేలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అడుగుతున్న ప్రశ్నలు లబ్ధిదారుల ఆందోళనకు కారణమవుతోంది. సంక్షేమ పథకాల ఏరివేతకేనా ఇటువంటి ప్రశ్నలు వేస్తున్నారనే కలవరం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజల అనుమానాలు నివృత్తి చేయడంలో సర్వే సిబ్బంది విఫలమవుతుండడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. సచివాలయ సిబ్బంది క్లస్టర్ల వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు చేస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా, ఇంటింటా సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది ఇంట్లో టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఏసీ, ల్యాప్‌టాప్ వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. ఇంటిలో ఎంతమంది సంపాదిస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నారా, ఆస్తులు, ఆదాయం ఇన్ కమ్ ట్యాక్స్, బైక్, కారు ఉన్నాయా వంట గ్యాస్ నెలకు ఎంత కరెంటు బిల్లు వస్తుంది? కుళాయి కనెక్షన్ ఉందా తదితర ప్రశ్నలు వేస్తుండడంతో ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయా? అనే వివరాలను సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు. పలు గ్రామాల్లో కుటుంబాల వ్యక్తిగత వివరాల సేకరణలో సచివాలయ సిబ్బందికి ప్రజల నుంచి సహకారం కొరవడుతోంది.

యువతకు నైపుణ్య శిక్షణ



సచివాలయాల పరిధిలోని పేదల్లో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని గుర్తించాం. గ్రామ సభలు ఏర్పాటు చేసి ఎంపిక పూర్తి చేశాం. పేద యువతకు వివిధ రకాల్లో నైపుణ్య శిక్షణనిచ్చి వారికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు కృషి చేస్తాం. శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పన అంశంపై ఉన్నతస్థితిలో ఉన్న వారి సహకారం తీసుకుంటాం.

– డీఎల్ఎస్ శర్మ, ఎంపీడీఓ, ఐ.పోలవరం

వైభవంగా గ్రామ దేవతల జాతర



ఇంజరంలో ప్రత్యేక అలంకరణలో పరదేశమ్మ

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల జాతరలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇంజరం గ్రామదేవత పరదేశమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్ తెలిపారు. పటవల తలుపులమ్మవారి తీర్థ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గరగ నృత్యం, కాళికా నృత్యం కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. శనివారం తీర్థం, కల్యాణి బృందంతో కూచిపూడి నృత్యం 30వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి తృతీయ ఏకాహ మహోత్సవం, అనంతరం అన్నదానం కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ధర్మకర్త చెక్కా అజయ్‌వర్మ తెలిపారు. గ్రాంటు గ్రామంలో వేంచేసి యున్న నూకాలమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

అరకొరగా తాగునీరు



వానపల్లిపాలెంలో పంచాయతీ కుళాయి నుంచి అరకొరగా వస్తున్న తాగునీరు

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెంలో వినాయక గుడి సెంటర్ ప్రాంతంలో తాగునీరు అరకొరగా అందటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యపై స్పందించిన ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి గత వేసవిలో రూ.7 లక్షల ఎంపీపీ నిధులతో బైపాస్ పైపులైను ఏర్పాటు చేయటంతో కొంత వరకు ఇబ్బంది తొలగిందని, అనంతరం ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ కొరవడటం కారణంగా గ్రామంలో కొంతమంది ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా కుళాయిలు ఏర్పాటు చేసుకోవడంతో అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని వారు వాపోతున్నారు. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో తాగునీటికి మరింత ఇబ్బంది తప్పదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



కామనగరువులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ పరిధిలోని విత్తనాల వారి కాలవగట్టు ఏరియా మెట్ల సత్యనారాయణ కాలనీ ప్రాంతంలో రూ.15 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించే రోడ్డు పనులకు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీ టీసీ మెండి గంగా భవానీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ మారణకాండను నిరసిస్తూ ర్యాలీ



అమలాపురంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: పాలస్తీనాలోని బైతుల్ ముకద్దస్ మసీదు, గాజా నగరంపై ఇజ్రాయెల్ దురాక్రమణకు పాల్పడుతూ చేస్తున్న మారణ కాండను నిరసిస్తూ అమలాపురంలో షియా ముస్లింలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక 12వ వార్డులోని మస్జిదే షియా, ఇతర ఆషరీ, ఆస్తానే అబ్బాసియా పీర్ల పంజా నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్ దేశ వైఖరిని నిరసించారు. ఇజ్రాయెల్ మారణకాండ, దురాక్రమణ ప్రయత్నాలను ఖండిస్తూ, ఆ దేశ వైఖరిని రంజాన్ నాలుగో శుక్రవారాన్ని అంతర్జాతీయ ఖుదస్ డేగా షియా ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీను నిర్వహిస్తున్నారని అమలాపురం షియా ఆస్నా అసరీ మసీదు అధ్యక్షుడు నిసార్ హుస్సేన్ తెలిపారు. మసీదు కార్యదర్శి కర్రార్ హుస్సేన్ పర్యవేక్షణలో ఈ నిరసన ర్యాలీ జరిగింది. తొలుత మసీదులో ఇజ్రాయెల్ రాక్షస పాలన అంతమవ్వాలని, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అల్లా సన్నిధిలో షియా ముస్లింలు మత గురువు హైదర్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యుత్ బిల్లు భారం తగ్గించాలి



పెదగాడవిల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉప్పలగుప్తం: ఇటీవల విద్యుత్ బిల్లుల భారం విపరీతంగా పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకురాలు పి.బేబి గంగారత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ శుక్రవారం బేబీ గంగారత్నం ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ సెక్టార్ల పరిధిలోని కార్యకర్తలు విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించి పేదలపై పడిన అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో అంగన్‌వాడీ టీచర్లు కె.మరియమ్మ, జె.భద్రకాళి, ఎస్.సుబ్బలక్ష్మీ, పి.పరిపూర్ణ ఉన్నారు.

సైక్లింగ్‌తో శారీరక, మానసిక ఆరోగ్యం



ఫిట్ ఇండియా సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న సాయ్ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్

యానాం: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సైక్లింగ్ వ్యాయామంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అకాడమీ ఇన్‌చార్జి ఎస్.ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలయోగి స్టేడియంలో పలువురు ఫిట్ ఇండియా సైక్లింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయ్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైక్లింగ్ సండే కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఉదయ్‌కుమార్ తెలిపారు.

మహిళా సంఘాల సభ్యుల రుణ ప్రణాళికపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం సురేంద్రబాబు

అమలాపురం రూరల్: మహిళా సంఘాల సభ్యుల హక్కులు. జీవనోపాధి కోసం 2025–2026 వార్షిక రుణ ప్రణాళిక అంచనా తయారు చేయడం కోసం ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అమలాపురం మండల వెలుగు ఏపీఎం అయితాబత్తుల సురేంద్రబాబు పేర్కొన్నారు.అమలాపురం రూరల్ మండలం బండారులంకలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్యూమరేటర్ల సమావేశంలో పాల్గొని శిక్షణనిచ్చారు.ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు అవసరమైన జీవనోపాధి, రుణాల మంజూరుపై మండలంలో డ్వాక్రా సంఘాలను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి ఐదు సంఘాలకు విద్యాధికులను గుర్తించి ఎన్యూమరేటర్లుగా ఎంపిక చేశామన్నారు. ఎన్యూమరేటర్లు గ్రామాల్లోని సంఘ సభ్యుల వద్దకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా కుటుంబ అవసరాలకు కావలసిన రుణ ప్రణాళిక తయారు చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వెలుగు సీసీలు రమేష్, దుర్గా కుమారి, వీఓఏలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్య సంరక్షణ



పేరూరు గ్రామ సచివాలయం వద్ద అవగాహన సదస్సులో పాల్గొన్న ఎఫ్‌సీఐ డీఎం శ్రీనివాస్

అమలాపురం రూరల్ : ఫోర్టిఫైడ్ బియ్యం కలిపిన ఆహారాన్ని తినడం వల్ల శరీరానికి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని భారత ఆహార సంస్థ పేరూరు డిపో మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. అమలాపురం మండలం పేరూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఆర్ఆర్ రామణన్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం పేదలకు రేషన్ డిపోల ద్వారా అందించే చౌక బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ద్వారా బలవర్ధక ఆహారం లభిస్తుందన్నారు. కేజీ సాధారణ బియ్యంలో 10 గ్రాముల ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ద్వారా వీటిని భుజించిన వారికి విటమిన్ బీ12, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు లభిస్తాయని తెలిపారు. ఈ బియ్యంతో వండిన ఆహారం తినడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చన్నారు. ఈ ఫోర్టిఫైడ్ కలిపిన బియ్యాన్ని కొందమంది ప్లాస్టిక్ బియ్యంగా అపోహ పడుతున్నారని, ఇది అవాస్తవమన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఎఫ్‌సీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

పలువురికి హెడ్‌మాస్టర్ గ్రేడ్–2గా పదోన్నతి

యానాం: నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీజీటీ, టీజీటీ (లాంగ్వేజెస్)గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు హెడ్‌మాస్టర్ గ్రేడ్–2గా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని ఆదేశాలు జారీ చేసారని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లి రుద్రరామగోపాల్, ఆకోండి సూర్యసుందరి, బి.నాగదేవి, శ్రీలక్ష్మీరమ, కారుమూరి పవన్‌కుమార్, పితాని రామచంద్రరావు పదోన్నతి పొందారు.

లోవరాజు సేవలు ప్రశంసనీయం



లోవరాజు దంపతులను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ ఉద్యోగులు

యానాం: యానాం వ్యవసాయశాఖలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్‌గా సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన లంక లోవరాజు సేవలు ప్రశంసనీయమైనవని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ శంకరన్ పేర్కొన్నారు. శుక్రవారం లోవరాజు ఉద్యోగ విరమణ సభ స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించారు. 35 ఏళ్ల పాటు విధి నిర్వహణలో అంకితభావంతో లోవరాజు పనిచేశారని పలువురు అభినందించారు. ఈసందర్భంగా లోవరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ పెం‌డెం సూర్యప్రకాష్, ఎస్ఆర్‌కే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, అధ్యాపకులు తాతపూడి ముత్యాలు, సూపరింటెండెంట్ కాళ్ల సత్యనారాయణ, లంక విద్యాసాగర్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులపై వేధింపులు ఆపాలి



టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలను వింటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అల్లవరం: టిడ్కో గృహాల లబ్ధిదారులు బ్యాంక్ రుణాలను అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని టీడీపీ హామీ ఇచ్చిందని, రుణ వాయిదాలు చెల్లించకపోతే గృహాలను వేలం వేస్తామని బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని టిడ్కో గృహాల లబ్ధిదారులు సీపీఎం నాయకులకు మొర పెట్టుకున్నారు. బ్యాంక్ అధికారుల వేధింపులు నానాటికీ పెరుగుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీపీఎం నాయకులు స్పందించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులపై వేధింపులు ఆపాలన్నారు. వేధింపులు కొనసాగితే లబ్ధిదారుల పక్షాన పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు అన్నారు. బోడసకుర్రులోని టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలపై సీపీఎం బృందం పర్యటించింది. టిడ్కో గృహాల సముదాయంలో కనీసం శ్మశాన వాటిక లేదని, ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు మృతదేహాన్ని అమలాపురం తీసుకెళ్లాల్సి వస్తోందని సీపీఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. టిడ్కో సముదాయంలో సరైన తాగునీరు లేదని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, దోమల బెడద తీవ్రంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. తొలుత బోడసకుర్రు పల్లిపాలెంలో సీపీఎం నాయకులు పర్యటించారు. పల్లిపాలెంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో గృహాల సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు టి.నాగవరలక్ష్మీ, ఎన్ బలరాం, జి దుర్గాప్రసాదు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 98 శాతం ఉత్తీర్ణత

యానాం: 2024–25 విద్యా సంవత్సరంలో యానాం శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీబీఎస్ఈ విధానంలో ప్రథమ సంవత్సరంలో 11వ తరగతిలో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రత్నప్రభ శుక్రవారం తెలిపారు. ఏహెచ్‌పీ విభాగంలో, ఏడుగురు హెచ్ఈపీలో 5, ఎంపీసీలో 12 మంది, బైపీసీలో 20 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొత్తం 45 మంది పరీక్షలకు హాజరయ్యారని అందులో 44 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామదేవతగా పూజలందుకుంటున్న ముసలమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లించారు. అలాగే సిరిపల్లమ్మకి గురువారం రాత్రి ఘనంగా జాతర జరిపారు.

మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టాలు



గిరియాంపేటలో మిషన్ శక్తి కార్యక్రమం

యానాం: సమాజంలో మహిళలు గృహహింసకు గురికాకుండా రక్షణ కల్పించేందుకు అమలు చేస్తున్న ప్రత్యేక చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జీజీహెచ్ వైద్యురాలు డాక్టర్ ప్రమీలా పేర్కొన్నారు. శుక్రవారం గిరియాంపేటలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డవలప్‌మెంట్, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా లింగ ఆధారిత హింస అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిత, గృహహింస, బాల్యవివాహాల నిరోధక చట్టాలు, పోస్కో చట్టాన్ని వివరించారు. అదేవిధంగా 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఆడపిల్లలను ప్రోత్సహించేందుకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రిప్కా రోజిలిన్, కళావతి, పి.మాధవి, శాంతి మిషన్‌శక్తి సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి, ఐక్యతకు ప్రతీక అని కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధర్యంలో స్థానిక ముస్లిం షాదీఖానాలో శుక్రవారం రాత్రి ఏర్పాటైన ఇఫ్తార్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్పీ బి.కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్‌తోపాటు పట్టణంలోని ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. ఎస్పీ, ఎమ్మెల్యేలు ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరూ కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. డీఆర్వో రాజకుమారి, డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కుమార్, ముస్లిం ప్రతినిధులు మహ్మద్ బషీర్ పాల్గొన్నారు.